# కాంతమ్మ కాశీయాత్ర

లక్ష్మీకాంతమ్మను ఆ ఊళ్ళో, కాంతమ్మ అని పిలుస్తారు. సహాయ సహకారాలకు ఆమె పెట్టింది పేరు. ఎవరింట్లోనయినా, అక్కర వస్తే ఆదుకొని గుండిగలు, గుండిగల, అన్నం వార్చి పోయగల నారీ శిరోమణి. అల్లాంటి అహమహమిక గల మనిషికి పక్షవాతం వచ్చినదని విని 'ఈదుల మద్దాలి' గ్రామం అంతా విస్తు పోయింది. ఆమె శరీరం కుడి ప్రక్క చలనమే లేకుండా పోయింది. ఎవరికి తోచిన వైద్యం వారు చెప్పారు.

కొందరు తేనె త్రాగించమన్నారు. మరి కొందరు పావురాయి నెత్తురు మర్దన చేయించ మన్నారు. ఎవరు చెప్పినవి చేసినా ఫలితం శూన్యమే అయింది.

వెంటనే సవారీ బండి కట్టుకొని, గుడివాడ తీసుకువెళ్ళారు. అక్కడ కొమ్ములు తిరిగిన అల్లోపతి డాక్టర్లు చూశారు.

మందు పని చేస్తుందో లేదో చెప్పలేమంటూనే, వైద్యం చేశారు. కొన్నాళ్లకు ఇంటికి తీసికొని వెళ్ళ మన్నారు. ఇంటి వసారాలో పడుకోపెట్టారు. కనులు లోతుకు పీక్కుపోయినై. మాట లేనట్లే లెక్క! ఏదో గొణుగుడుతో, నూతిలో నుండి ధ్వని వచ్చినట్టుగా వస్తుంది. తప్పదు కనుక, ఇంట్లో వాళ్ళు ఏదో సేవ చేస్తున్నారు. ఆ మనిషికి ప్రాణం ఉన్నది కనుక, వసారాలోనైనా వుంచక తప్పలేదు.

ఆమె దగ్గర ఎవరూ లేని తరుణంలో, వాకిట్లోకి ఒక తెల్ల గడ్డపు గోసాయి వచ్చాడు. ఆనాడు ఆదివారం. ముష్టికి వచ్చాడనుకొని, ఇంట్లో వాళ్లను పిలవాలని, కాంతమ్మ ప్రయత్నిస్తూ, అతనికేదో సైగలు చేసింది. హుటాహుటి, అతడు, మంచం దగ్గరకు వచ్చేశాడు. ఏడు మందు పొట్లాలు, మంచంమీద ఎత్తిపడవేశాడు. వాటిని ఏడు రోజులు మంచినీటి అనుపానంతో వాడమని చెప్పి తన దారిని తాను పోయాడు. భర్త ఇంటికి వచ్చిన తర్వాత, ఆ పొట్లాలు చూపించి, ఎల్లాగయితే యేం, గోసాయి చెప్పిన మాటలు అతనికి చెప్పగలిగింది.

దానిని గ్రహించిన తర్వాత ఆ భర్త వెంటనే, ఒక పొట్లం తీసికొని దగ్గరలో ఉన్న "జువ్వనపూడి"లో ఒక వైద్యుడి దగ్గరకు వెళ్ళాడు. దానిని వాడవచ్చునో లేదో తెలిసికోవడానికి! అతడా మందును ఒక నీటి పాత్రలో వేసి చూశాడు. అది తేలింది. మునగలేదు కనుక, అది మంచి మందేనని తీర్పు చెబుతూ, ఆ నీళ్ళ ప్రక్కనున్న గోడమీద పారబోశాడు. ఆ పరీక్ష ఎల్లాంటిదో! ఆ వైద్యుడి మీద నమ్మకం చేత, ఆ మందును కాంతమ్మకు భర్త వాడడం ప్రారంభించాడు. చిత్రంగా, మొదటి పొట్లం తోనే కాంతమ్మకు గుణమివ్వడం ప్రారంభించింది. ఆ గోసాయి తిరిగి గురువారం వచ్చి, చేతులెత్తి ఆశీర్వదించి వెళ్లిపోయాడు. అతడు, ఇంట్లో చిన్న పిల్లలకూ కాంతమ్మకూ తప్ప, మరెవ్వరికీ కన్పించ లేదు. పొట్లాలు వాడడం పూర్తి అయ్యేసరికి ఆమె లేచి కూర్చోవడమేకాక, నడవడం కూడా ప్రారంభించి ఊరి వారి నందరినీ ఆశ్చర్యపరిచింది.


ఆదివారంనాడు, తిరిగి గోసాయి వచ్చాడు. "మీదయ వల్ల, అంతా బాగేనే ఉన్నది. కాని, కుడి జబ్బ, ఎత్తనీయడంలేదు. కొంత వరకే లేపగలుగుతున్నాను. అది ఒక్కటే ఇబ్బంది." అన్నది లక్ష్మీకాంతమ్మ. గోసాయి నవ్వాడు.

"ఎలా లేస్తుంది? ఒక పొట్లం గోడమీద పారబోశారుగా!" అన్నాడు తడుముకోకుండా.


"నా సంగతి ఇంతేనా?"

"నేను స్వతంత్రుణ్ణి కాదు. మా గురువు పంపితే వచ్చాను. ఆయన ఆజ్ఞ అయితే అదీ వస్తుంది. ఏ సంగతీ తర్వాత చెబుతాను." అంటూ వెళ్ళిపోయాడు.

అయాచితంగా ఉపకారం చేసిన ఇతడెవరా అని, కాంతమ్మ రోజూ ఆలోచించడం ప్రారంభించింది. జువ్వనపూడిలో తన భర్త వైద్యుడి దగ్గిరకు వెడితే, అతడు మందు పారబోస్తే, ఆ సంగతి ఇతని కెల్లా తెలసిందా—అని ఆశ్చర్యపడుతోంది. గురువారం వచ్చిన గోసాయి, గురువు ఆజ్ఞ అయిందని, ఇంకొక పొట్లం ఇచ్చాడు. దానిని వేసికొన్న వెంటనే కాంతమ్మ, తన చేతిని అనాయసంగా లేపగలిగింది.



పైడిపాటి సుబ్బరామశాస్త్రి



## నా కలకత్తా

నేనుండేది కలకత్తా
నడి వీథుల్లో అడుగడుగునా చెత్త, చెత్త, చెదారాలే
ఏ రోజూ విద్యుత్ కొరత,
మిల్లుల్లో పని నిలిపివేత,
కార్మికుల వేతనాలలో సరేసరి కోత,
చీటికీ, మాటికీ 'బంగ్లా బందు'
ప్రయాణీకులకు ఇందువల్ల నిత్యం కలిగేటి ఇబ్బందు,
రేషను షాపులలో నిత్యావసర వస్తువుల కొరత,
ఆ కారణంచే మల మల మాడే ఆకలితో నలత,
నిత్యం నీళ్ళ సరఫరాకు అంతరాయం,
దాహం, ఆకలికి విశ్రాంతి
చెత్త నీళ్ళు తాగితే ప్రాణ భీతి,
నిత్యం ఏక్సిడెంట్‌లు, ఖూనీలు, దోపిడీలు,
చేసేవారు నిరుద్యోగులులా వున్న దొరలు,
ఇక్కడ ప్రాణానికి లేదు ఏమీ విలువ,
బ్రతుకు తెరువు నేర్వలేని వాడు ఒక తులువ,
బెంగాల్‌లో ఎక్కడ చూస్తే అక్కడ పట్టభద్రులు,
ఉద్యోగాల కోసం గాలించాలి యంత్రంలా,
ఎందుగా లంచాలు ఇవ్వాలి కట్నాల్లా,
చివరకు మనకు మిగిలేది ఖాళీ గల్లా!
డబ్బు వున్న వాడిదే జల్సా,
లేని వాడికి ఎదురయ్యేది జీవితములో నిరాశే
ఎప్పటికో ఇటువంటి జీవితానికి ముక్తి
ఫలో మన రాష్ట్రానికి అదే మనకు మిగిలిన యుక్తి
భగవంతుడా, ఎన్నాళ్ళు ఈ రాత?
అంటే అంటాడు దేముడు 'మెదడుకు వెయ్యి మేత'
కలకత్తాలో జీవితం వద్దు యిక్కడకు రావద్దు
నేను చెప్పేను, గుడ్ బై టాటా!
కలకత్తా చెప్పింది 'ఆంధ్ర భాయ్ టా టా'!!

—డాక్టర్ వి.ఎల్. నారాయణ, కలకత్తా.

"మీ పేరేమిటి?" అంది.

"పరబ్రహ్మ ఋషి" అన్నాడు, గోసాయి.

"మీ గురువుగారి పేరు "

"సదానంద ఋషి!"

"ఆయన గురువు పేరు?"

"మా పరమగురువు పేరు రోమకేతు మహర్షి"

"వీరంతా ఎక్కడ ఉంటారు?" ఎక్కడ ఉన్నా, నీవు రాలేవు. ఒక్కొక్కప్పుడు, అరణ్యంలో, మరొకప్పుడు, హిమాలయంలో. ఇంకొకప్పుడు, ఇల్లాంటి చోట్ల! మేము ఎక్కడ ఉంటామో మాకే తెలుస్తుంది. నాకెన్నేళ్లో తెలుసునా! రెండు వందల ఏళ్ళు! అన్ని భాషలు మాట్లాడగలం— అన్ని చోట్లా ఉండగలం!"

"సిద్ధులన్న మాట!"

"ఏమయినా అనుకో!" "నా యందు, మీ గురువుగారికెందుకింత అనుగ్రహం? నేను వారి నెరుగను కదా?" "బాగా అడిగావు. నీవు పూర్వ జన్మలో మా 'కోటి' లోని భక్తురాలవు. పక్షపాతంతో ఏ జన్మలోనో వ్యవహరించిన దోషం చేత, నీకు పక్షవాతం వచ్చింది. కొంత కర్మానుభవం కలిగిన తర్వాత గుర్వనుగ్రహం కలిగింది. నిష్కృతి కలిగింది", "మీ గురువు, నాకేమయినా సంసార తరణోపాయం చెబుతారా?" "అందుకే, నేను వచ్చింది. నీవు పూర్వజన్మలో కాళికాదేవి భక్తురాలవు"

"నీవు చెప్పిన తర్వాత నాకూ అల్లాగే అనిపిస్తోంది" అంది, కాంతమ్మ.

ఈ ప్రసంగం జరిగేటప్పుడు అక్కడ ఎవ్వరూ లేరు.

"కాళీ మంత్రం చెబుతా, వినుకో!"

తన వ్యాధి నయం చేసిన అతనిని విశ్వసించడమే న్యాయమనుకుంది కాంతమ్మ. అంగీకరించింది. అతడు చెవిలో రహస్యంగా ఉపదేశించాడు.

ఆమె ముఖం జాజ్వల్యమానమయింది. "అద్దంలో ముఖం చూసుకొనిరా, లోపలకు వెళ్లి!" అన్నాడు గోసాయి. కాంతమ్మ అద్దంలో చూసుకుంటే, అమ్మవారి కళ తనలో ఉట్టిపడుతోంది.

"ఈ తేజస్సు నాలో ఎల్లా ప్రవేశించింది?"

"గుర్వనుగ్రహం! అదీకాక! ఆ మంత్రం, ఇదివరకే, నీ జీవ సంపుటిలో ఉన్నది. నిప్పుపైన నివురును ఊదినట్లుగా, నేను నీ చెవిలో ఊదాను. అంతే!

మంత్ర మహిమవల్ల, నీకు కొన్ని శక్తులు గలుగుతవి. ఖంగారు పడబోకు. పూర్వజన్మలో ఈ మంత్రాన్ని నీవు బాగా నూరి ఉండడం చేత, నామకః ఇప్పుడు ఉపదేశమయినా, దాని ఫలితం సమృద్ధిగా కన్పిస్తుంది. డబ్బు కోసం, శక్తులను దుర్వినియోగం చేయకు. నీవు విభూతి ఇస్తే, కొన్ని రోగాలు పోతాయి. జీవకారుణ్యంతో ప్రవర్తించు. దానిని మించిన ధర్మం లేదు. ఆది, గురు, వారాలలో నన్ను తలచుకొంటే నేను వచ్చి సందేహ నివృత్తి చేస్తూ ఉంటాను" అని గోసాయి అదృశ్యమయాడు.

* * * *

కాంతమ్మ మగడు, తనకున్న ఎకరం పొలంలో పచ్చే

ధాన్యం వల్ల, సంసారం గడవడం కష్టమైనందువల్ల, విజయవాడలో సత్యనారాయణపురంలో, నివాసమేర్ప రచుకొన్నాడు. ఏదో సంపాదన చూసుకొన్నాడు.

కాంతమ్మ మాత్రం, మంత్రాన్ని బాగా నూరి, ధ్యానంలో నిశ్చలంగా ఉండేది. ఆమె కెన్నో అనుభూతులు కలిగినై. తాని జన్మలో ఎప్పుడూ చూడని పరమ గురువు దర్శనమిచ్చాడు. పరమేష్టి గురువు కూడా, లీలగా, భాసించాడు. తిరిగి, ఆ స్థానంలో కాళికాదేవి దర్శన మీయడం ప్రారంభించింది. భక్తిపార వశ్యం ఎక్కువయింది.

ఆమె ఇరుగుపొరుగు వారికి ఆమె గొప్ప భక్తురాలుగా కన్పించింది. ఆమె దగ్గర ఏదో మహిమకూడా తప్పక ఉంటుందని ఊహించడం ప్రారంభించారు. తర్వాత అది నమ్మకంగా మారింది. పిల్లలకు జ్వరం వచ్చినా, దయ్యం పట్టినదని అనుమానం కలిగినా, విభూతి, కుంకుమల కోసం, కాంతమ్మ దగ్గరకు రావడం ప్రారంభించారు. ఆమె కాదనలేక ఈయడానికి అల వాటు పడింది. వారికి సద్యః ఫలితం కన్పించేది. ఆ సంగతి వారు, చుట్టు ప్రక్కల వారికి చెబితే, వారికే గురి కుదిరి, తండోప తండాలుగా ఎగబడడం ప్రారంభిం చారు.

దానితో ఆ యిల్లు భూత వైద్య కేంద్రంగానూ, భజనాలయంగానూ మారిపోయింది. శుక్ర, మంగళ, వారాలలో, అరటిపళ్లూ, కొబ్బరికాయలూ, అసంఖ్యా కంగా వచ్చిపడేవి—నివేదన చేసిన తర్వాత, ఆ ప్రసాదం, ఆమె అందరికీ పంచిపెట్టేటట్లు చేసేది. మిగిలినవి ఇంట్లో వినియోగపడేవి. కాలం కలిసివచ్చింది.

కాంతమ్మ మగడు, స్థలం కొని, గృహ నిర్మాణం చేశాడు. లోకంలో, విశ్వాస పరులు ఎల్లా ఉంటారో, విశ్వాస హీనుల అల్లాగే ఉంటారనడానికి ఉదాహరణాలు కోకొల్లలు. కొందరకు కాంతమ్మ ప్రతిష్ట పెరగడం కన్ను కుట్టింది.

'ఇదంతా భాష్!' పొమ్మన్నారు. సంపాదన కోసం వేసిన ఎత్తు—అని అన్నారు. ఆ ప్రచారం ముమ్మర మయింది.

గురువుతో కాంతమ్మ ఈ విషయం మొత్తుకోవడం ప్రారంభించింది.

"నీ దారిని నీవు పో! ఎవరినీ లెక్కచేయకు?" అన్నాడు అతడు దర్శనమిచ్చి.

"నన్ను మహత్తు (మహిమ) చూపమంటున్నారు స్వామీ? నేనేమి చూపగలను?" అన్నది.

"ఏమి చూపమంటున్నారు?"

"నేనిక్కడే ఉండి, కాశీ గంగ చెంబులోపట్టి తెచ్చి చూపాలని అంటోంది ఒకావిడ" అంది.

"ఇంతేకదా? రేపు శుక్రవారం భజనలో వారికి మధ్యలో నీవు ముసుగు పెట్టుకుపడుకో భజన బాగే చేస్తే కాశీ గంగ చెంబు వస్తుందని చెప్పు! వాళ్ళ తాళాలు పగిలేటట్లు భజన చేస్తూ ఉంటారు. అప్పుడు నీవు కాశీ వెళ్లనూ వెడతావు—గంగచెంబు తేనూ తెస్తావు" అని గురువు మాయమయ్యాడు.


* * * *

శుక్రవారం నాడు భజన జరుగుతోంది. ఆమె కళ్ళు మూసుకొని, ముసుగుపెట్టుకొని పడుకుంది. తాను పైకి లేస్తున్నట్లుగా ఒక అనుభూతిని పొందింది కాంతమ్మ. వెంటనే మణికర్ణికా ఘట్టం దగ్గర ఉన్నది. అక్కడ నుండి ప్రయాగ వెళ్లినట్లనిపించింది. గంగ చెంబు పట్టి ధట్టా వేయించినట్లనిపించింది. ఆ స్నానపు నీళ్ల ఓడు తూనే తిరిగి వచ్చినట్లనిపించింది.

తాళాలు ప్రమోగుతూనే వున్నాయి.

"జై! మహాకాళీ?" అని ముసుగులో నుండి ఒక పెద్ద కేక వినిపించింది. వెంటనే చుట్టూ భజన చేసేవారు కూర్చొనే ప్రదేశంలో చెమర్చినట్లనిపించింది. కాంతమ్మ కప్పుకున్న బట్ట తడిసిపోవడం కూడా వారు చూచారు. నీళ్లోడుతున్న జుట్టుతో కాంతమ్మ లేచి కూర్చుంది. ఒడిలో కాశీ గంగ చెంబు ఉంది. ఆ చెంబును, ఆ మహిమ చూపమని కోరిన ఆవిడకు ఇచ్చివేసింది కాంతమ్మ.

కాంతమ్మకు హారతులిచ్చారు, కొబ్బరికాయలు కొట్టారు, కాళ్లమీద పడ్డారు. అయితే ఆ మరురోజు నుండి ఆమె ఇతరులకు కన్పించడం మానివేసింది. వెంటనే కలకత్తా వెళ్లి కాళీ దర్శనం చేసింది. తిరిగి విజయవాడ రానేలేదు. ●




## "నేను తప్పిపోయాను"

నేను తప్పిపోయాను
దయచేసి మీరో ఏ ఒక్కరైనా
మీ హృదయంలో నన్ను వెతికి పెట్టరూ?

"నా తండ్రి-మా పెద్ద నాయన
పెద్ద డాక్టరవుతాడు" అమ్మ

"నీకేంరా? మాథ్స్‌లో ఫస్టొస్తే
ష్యూర్! ఇంజనీరుగా సెటిలవుతావు" మిత్రుడు

"నీ ఇంటెలిజెన్స్ నన్ను
ఫాసినేట్ చేసింది" ప్రేయసి

"సైంటిస్టయి దేశాన్ని
ఉద్ధరించాలి" గోల్డ్ మెడల్ ఇస్తూ యూనివర్సిటీ
కానీ
నేను ఏదీ అవ్వలేకపోయాను
కారణాలు
దేశమా? వ్యవస్థా??
ఫెయిర్‌ఫాక్స్, బోఫోర్సులని
అసెంబ్లీలో పేర్చి చెండాడే ప్రతిపక్షాలా?
వాటన్నిటిని కప్పిపెట్టి
వెలికితీసిన పత్రికల మీద
దాడిచేసే ప్రభుత్వమా?
ఏదిఏమైనా ఎంప్లాయ్‌మెంటు
ఎక్స్ఛేంజి వారు న్యాయంగానే
నన్ను నిర్లక్ష్యం చేశారు.
అంతవరకు నన్ను మెచ్చిన
అమ్మ, మిత్రుడు, ప్రేయసి, ప్రొఫెసర్
"చదివాడు ఎందుకు? చాతకానివాడు"
అనేశారు బాహాటంగానే
సమాజం - మనుషులు
పువ్వులు - కోకిల
కవిత్వం - రహదారులు
నన్ను వెలివేశాయి
"బతకలేనివాడు బతుక్కే
బరువన్నట్టు" చూశాయి
ఈ వింత ద్వంద్వార్థ
ప్రపంచ రీతికి - నీతికి
దిమ్మెరపోయి ఎటు పోవాలో
తెలిక దిక్కుమొహంతో తప్పిపోయాను.
మీ హృదయంలో
నన్ను వెతికిపెట్టరూ?

[అంకితం నిరుద్యోగ మిత్రులకి]

—కలిదిండి జయ